వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 05 | సంచిక : 066
పేజీలు : 08 | వెల: రూ.5/-
శుక్రవారం
ఫిబ్రవరి 20, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## బ్యాడ్మింటన్‌లో వరంగల్‌కు స్వర్ణం



8లో..

- ఏసీపీల జోడీని వరించిన విజయం
- సీపీకి కాంస్య పతకం

సైబరాబాద్ కమీషనర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 4వ రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ లో టేబుల్ టెన్నిస్ గెజిటెడ్ అధికారుల విభాగంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. హోరాహోరీ జరిగిన మ్యాచ్ లో సీపీ తృతీయ స్థానంలో నిలిచి వరంగల్ కు మరో పతకాన్ని అందించారు. – **వరంగల్ వాయిస్, క్రైం**



- దైవ భూములకు రక్షణ కవచం
- ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధిలో తనదైన ముద్ర
- మాటలు కాదు చేసి చూపించే నైజం అమె సొంతం
- అవగాహనే అన్నింటికీ మూలం అని నమ్మే వ్యక్తి

## కర్తవ్యమే దైవం.. సేవే నైజం

### దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామల సునిత

ప్రత్యేక కథనం 2లో..

కర్తవ్యమే దైవం.. మాటల్లో మాధుర్యం.. చేతల్లో అసమాన్య ప్రతిభ.. అకుంఠిత కార్యదీక్ష ఆమె సొంతం. సాధారణ జీవితాన్ని అసాధారణ విజయపథం వైపు మళ్లించుకోవాలంటే కేవలం పట్టుదల ఒక్కటే ఉంటే సరిపోదు శ్రమించే గుణం, పరిస్థితులను అనుకూలంగా మార్చుకోగల నేర్పు ఉండాలని నిరూపిస్తున్నారు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇంచార్జి డిప్యూటీ కమిషనర్ రామల సునిత. సమాజాన్ని ఆకలింపు చేసుకోవాలన్న జిజ్ఞాస, ప్రజాసేవలో క్రియాశీలక భాగస్వామి కావాలన్న కాంక్ష ఆమెను ఉన్నత శిఖరాలకు చేర్చాయి. బాధ్యతల పరంగా మాటలకు తావులేకుండా 'చేసి చూపించే' తత్వమే ఆమెను ఇతరులకు భిన్నంగా నిలబెట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాలయాల అభివృద్ధికి, భూముల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తూనే.. భక్తుల సమస్యలను నేర్పుగా పరిష్కరిస్తున్న ఆమె జిల్లాలో ఒక 'ప్రతిభావంతమైన నారీమణి'గా గుర్తింపు పొందారు. 'అవగాహనే అన్నింటికీ మూలం.. అది ఉంటే సమస్యలు దూరం' అనే సిద్ధాంతంతో ముందుకు సాగుతున్న సునిత విశిష్ట సేవలపై వరంగల్ వాయిస్ ప్రత్యేక కథనం..

## భూపాలపల్లి జిల్లా కోర్టులో అవినీతి



☐ ఏసీబీకి చిక్కిన ముగ్గురు ఉద్యోగులు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో ఏసీబీ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఒక కేసుకి సంబంధించి కోర్టు తీర్పు కాపీ ఇచ్చేందుకు కోర్టు సిబ్బంది లంచం డిమాండ్ చేయగా, బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. దీంతో ఏసీబీ అధికారులు కోర్టు సిబ్బంది పాలకుర్తి సాయిచరణ్ (స్టెనోగ్రాఫర్), పున్నం రజిత, కొమ్ము సునీతలు రూ.5వేలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ప్రజలకు న్యాయం జరగాల్సిన న్యాయస్థానంలోనే అవినీతి చేపలు చిక్కడం భూపాలపల్లిలో కలకలం రేపుతోంది. – **వరంగల్ వాయిస్, భూపాలపల్లి**

## మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

- తాగు నీరు, పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యం
- పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



8లో..



8లో..

## ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

- పాల్గొన్న ఎమ్మెల్యే దొంతి, కలెక్టర్ సత్య శారద
- గ్రేయిన్ మార్కెట్ లో మర్చి రైతులతో పిచ్చాపాటి

సంవత్సరీకము



నీవు మా నుండి భౌతికంగా దూరమైనా నీ జ్ఞాపకాలు మమ్ము వీడలేదు...
తేది. 21-02-2026 శనివారం రోజున మా తల్లి గారైన
శ్రీమతి వన్నాల విజయ (జయక్క) గారి
ప్రథమ సంవత్సరీకము జరుపబడును.
కావున తామెల్లరు విచ్చేసి మా తల్లి గారి ఆత్మకు శాంతి చేకూర్చగలరని మనవి

తేది: 21-02-2026 శనివారం
కార్యస్థలం: అలకనంద ఫంక్షన్ హాల్,
కాకతీయ ప్రకృతి చికిత్సాలయం ఎదురుగా, హంటర్‌రోడ్, హనుమకొండ.
సహపంక్తి భోజనం: మధ్యాహ్నం గం॥ 1-30 ని॥లకు

ఇట్లు
భర్త: వన్నాల శ్రీరాములు Ex. MLA (వరంగల్ జిల్లా)
కుమారులు: డా॥ వన్నాల వెంకటరమణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బి.జె.పి.
వన్నాల అరవింద్ కుమార్
వన్నాల రాజేష్ కన్నా
కోడళ్ళు, మనుమరాళ్ళు - మనుమలు



మాటలో మాధుర్యం.. అసమాన్య ప్రతిభా పాటవాలు ఆమె సొంతం. జీవితంలోనైనా, కెరీర్లోనైనా పైకి ఎదగడానికి పట్టుదల, శ్రమించే గుణం సానుకూల దృక్పథం.. వంటి లక్షణాలెన్నో కావాలి. వాటితో పాటు పరిస్థితులను మనకు అనుకూలంగా మార్చుకోగల నేర్పు ఉండాలి. సమాజాన్ని ఆకలింపు చేసుకోవాలన్న జిజ్ఞాస, ప్రజాసేవలో క్రియాశీలక భాగస్వామి కావాలన్న కాంక్ష సాధారణ జీవితాన్ని కూడా అసాధారణ స్థాయికి చేరుస్తాయి. దీనికి చక్కటి నిదర్శనం రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇంచార్జి డిప్యూటీ కమిషనర్ రామల సునిత.



గడ్డం
కేశవమూర్తి

# కర్తవ్యమే దైవం.. సేవే నైజం

## దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామల సునిత

- దైవ భూములకు రక్షణ కవచం
- ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధిలో తనదైన ముద్ర
- మాటలు కాదు చేసి చూపించే నైజం అమె సొంతం
- అవగాహనే అన్నింటికీ మూలం అని నమ్మే వ్యక్తి

**విధులపరంగా ఆమె మొదట పనికే అధిక ప్రాధాన్యతనిస్తారు. పట్టుదల, కార్యదీక్షతో ముందుకెళ్తారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాలయాల అభివృద్ధికి, భూముల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తూనే, భక్తుల సమస్యలను ఎంతో నేర్పుగా పరిష్కరిస్తూ ప్రతిభ గల నారీమణీగా గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే, అవగాహనే అన్నిటికి మూలం.. అది ఉంటే సమస్యలు దూరం అన్నది రామల సునిత నమ్మిన సిద్ధాంతం. బాధ్యతల పరంగా ఆమెది మాటల్లో చెప్పే స్వభావం కాదు.. చేసి చూపించే నైజం ఆమెది.**

### కుటుంబ నేపథ్యం...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో 1989 ఫిబ్రవరి 22న రామల వెంకట నరసమ్మ–బిక్షాలు దంపతులకు రామల సునిత జన్మించారు. వీరి తల్లి గృహిణి కాగా, తండ్రి రైల్వే శాఖలో పనిచేసి రిటైరయ్యారు. అన్నయ్య నరేష్ ట్రాన్స్ కో లో, తమ్ముడు రాజేష్ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగాలు చేస్తున్నారు. హనుమకొండకు చెందిన ప్రముఖ న్యాయవాది కుమ్మరి అమర్నాథ్ ను సునీత వివాహం చేసుకున్నారు. వీరికి కుమారుడు వేదాన్ష్ జన్మించారు. సునిత ఒకటో తరగతి నుంచి నాలుగో తరగతి వరకు పాల్వంచలోని వివేకానంద పబ్లిక్ స్కూల్లో చదివారు. ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు అదే ఊరిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో విద్యనభ్యసించారు. పాల్వంచలోని నేతాజీ జూనియర్ కళాశాలలో ఇంటర్, ఆడంస్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ (ఈసీఈ) పూర్తి చేశారు. తరువాత సివిల్ సర్వీస్ పై మక్కువతో హైదరాబాద్ లోని ఆర్సి రెడ్డి కోచింగ్ సెంటర్ లో కొంతకాలం శిక్షణ తీసుకున్నారు. 2011లో వరుసగా అటు సివిల్స్, ఇటు ఏపీపీఎస్సీ గ్రూప్స్ రాయడంతో గ్రూప్–2కు సునిత సెలెక్టయ్యారు. దీంతో ఆమెకు దేవాదాయ, ధర్మాదాయ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఉద్యోగం లభించింది.

### ఉద్యోగ ప్రస్థానం..

2013 జూన్ 3న ప్రభుత్వ ఉద్యోగంలో చేరిన రామల సునిత తొలుత హనుమకొండ జిల్లాలోని అగ్రంపాడు శ్రీ సమ్మక్క సారలమ్మ జాతర ఎగ్జిక్యూటివ్ అధికారిగా తొలి పోస్టింగ్ పొందారు. తరువాత ఐనవోలు, కొత్తకొండ, శ్రీ రామలింగేశ్వర, శ్రీ వెంకటేశ్వర, కట్ట మల్లన్న, శ్రీ కాశీ విశ్వేశ్వర, శ్రీ భోగేశ్వర దేవాలయాల్లో కార్యనిర్వహణ అధికారిగా ఆమె సేవలందించారు. 2016లో శ్రీ కొత్తకొండ వీరభద్ర స్వామి దేవాలయంలో గ్రేడ్ వన్ ఈవోగా పనిచేస్తున్న సందర్భంలో అసిస్టెంట్ కమిషనర్ గా పదోన్నతి లభించింది. ప్రస్తుతం శ్రీ భద్రకాళి ఆలయ కార్యనిర్వాహణ అధికారిగా విశిష్ట సేవలు అందిస్తున్న ఆమె 2026 జనవరి 21 నుంచి ఇంచార్జి డిప్యూటీ కమిషనర్ గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అగ్రంపాడు, కొత్తకొండ, మేడారం జాతరలతో పాటు కాళేశ్వరం, సరస్వతీ పుష్కరాలను ఘనంగా నిర్వహించడంలో సునిత కీలక పాత్ర పోషించారు. అదేవిధంగా భద్రకాళి ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు, బ్రహ్మోత్సవాలు, శాకంబరీ, శ్రావణమాసం తదితర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరపించడంలో ఆమె కృషి ఎనలేనిదని చెప్పవచ్చు.

### శ్రమిస్తేనే సత్ఫలితాలు..

కష్టించి పనిచేస్తే... అభివృద్ధి సాధ్యమేనంటారు రామల సునిత. దేవాదాయ, ధర్మాదాయ శాఖకు సంబంధించిన భూములను పరిరక్షిస్తున్న ఆమె ఆలయాల పునరుద్ధరణకు విశేష కృషి చేస్తున్నారు. శ్రీపద్మాక్షి ఆలయం, పెద్ద కోవెల, గోవిందరాజుల గుట్టకు చెందిన ఎకరంన్నర భూమిని అన్యాక్రాంతం కాకుండా చూశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1,060 దేవాలయాలకు సంబంధించిన భూములకు సర్వే జరిపించి రెవెన్యూ ఆధారాలు సమకూర్చారు. ఈ దేవాలయాలకు చెందిన



సుమారు మూడు వేలఎకరాల్లో 500 సైన్ బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు, 60 మంది భూ ఆక్రమణదారులపై కేసులు వేయించారు. ముఖ్యంగా పరకాల డివిజన్ లో ఉన్న దేవాలయాల భూములన్నింటికీ హద్దులు నిర్ణయించి వాటిని ఆన్ లైన్ లో నమోదు చేయించారు. అదేవిధంగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫీస్ రికార్డులను మొత్తం డిజిటలైజేషన్ చేయించారు. మహబూబాబాద్ జిల్లా అబ్బాయి పాలెంలోని శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయానికి చెందిన 14 ఎకరాలను సోలార్ ప్లాంటుకు అగ్రిమెంట్ చేయించి ఆ దేవాలయానికి ఆర్థిక పరిపుష్టిని కల్పించారు. ధూప, దీప నైవేద్య పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లోని 450 దేవాలయాలకు ప్రతినెల రూ.10 వేల ఆర్థిక సహాయం అందిస్తూ, వాటి పురోభివృద్ధికి కృషి చేస్తున్నారు.








### దేవాలయాల అభివృద్ధి..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేవాలయాల అభివృద్ధికి డిప్యూటీ కమిషనర్ రామల సునిత నడుం బిగించారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మేడారం మహా జాతరలో రూ.251 కోట్లతో అభివృద్ధి పనులు చేసి జాతరను విజయవంతం చేశారు. రూ.12 కోట్లతో రేగొండ మండలం కోటంచ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పునరుద్ధరించారు. రూ.25కోట్లతో కాళేశ్వరం, రూ. 5కోట్లతో కురవిలోని శ్రీ వీరభద్ర స్వామి ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశారు. అదేవిధంగా మెట్టుగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని దేవాలయ నిధులతో తీర్చిదిద్దారు. రూ.30కోట్లతో శ్రీ భద్రకాళి అమ్మవారి మాడవీధులను అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రూ.12 కోట్ల సీజీఎఫ్ నిధులను మంజూరు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ రామల సునిత తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గుడులు, గోపురాలు కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. శిల్పకళా వైభవానికి ఓరుగల్లు ప్రతీకగా నిలుస్తోందని సునిత వివరించారు. నైపుణ్యమే ఆర్థిక స్వావలంబనకు బలమైన పునాదిగా నిలుస్తుందని, యువతులు, మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని దేవాదాయశాఖ డీసీ సునిత కోరారు. సక్సెస్ అంటే ఎంత పెద్ద హోదా సాధించాము, ఎంత సంపాదించాము అన్నది కాదు. తాము నిర్వహిస్తున్న శాఖలో మన వంతుగా ఎలాంటి గుర్తులను వదిలి వెళుతున్నామన్నదే మనం సాధించిన విజయాన్ని నిర్వచిస్తుంది అంటా రామే.







# ‘ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం’

### ◆ శంభునిపేటలో అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సమాజంలో అసమానతలు తొలగి, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు లభించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని పీపుల్స్ మీడియేషన్ సెంటర్ ప్రతినిధులు పేర్కొన్నారు. ‘వరల్డ్ డే ఆఫ్ సోషల్ జస్టిస్’ (ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం) పురస్కరించుకుని శుక్రవారం వరంగల్ నగరం శంభునిపేటలోని పోతన లైబ్రరీ సెంటర్ వద్ద పీపుల్స్ మీడియేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పీపుల్స్ మీడియేషన్ సెంటర్ మీడియేటర్ ధర్మపురి రాజగోపిందు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ప్రముఖ విద్యావేత్త డాక్టర్ బాల్నె సాంబమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రకటించిన ఈ అంతర్జాతీయ దినోత్సవం పేదరికం, నిరుద్యోగం, సామాజిక అసమానతల పరిష్కారానికి దిక్సూచి వంటిది. ప్రతి వ్యక్తి ఆత్మగౌరవంతో జీవించేలా సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. హక్కులు మరియు బాధ్యతల పట్ల అవగాహన పెంచుకుని, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారత ప్రభుత్వ జాతీయ యువజన పురస్కార గ్రహీత మండల పరశురాములు, పీపుల్స్ మీడియేషన్ సెంటర్ మీడియేటర్లు వద్నాల నరేందర్, మార్గం యెల్లయ్య, రిటైర్డ్ ఉపాధ్యాయులు జడల చంద్రశేఖర్, ఎలుగు దుర్గేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. సమాజంలో మధ్యవర్తిత్వం ద్వారా సమస్యల పరిష్కారం, సామాజిక సమతుల్యతపై వక్తలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

# భద్రకాళి చెరువు వద్ద ఖగోళ వింతల వీక్షణ

### 28న ‘రుద్రమ’ రాకెట్ ప్రయోగం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని భద్రకాళి ట్యాంక్ బండ్ వద్ద ఖగోళ శాస్త్రంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అడ్వాన్స్‌డ్ డైనమిక్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ లాబొరేటరీ యువ శాస్త్రవేత్త శశాంక్ భూపతి బృందం, నిట్ వరంగల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతోంది. శుక్రవారం ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ ఈ కేంద్రాన్ని సందర్శించి, నిర్వాహకుల కృషిని అభినందించారు. ఈ ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక టెలిస్కోపుల ద్వారా విద్యార్థులు, నగర వాసులు నక్షత్రాలు, గ్రహాలను ప్రత్యక్షంగా వీక్షిస్తున్నారు. ఖగోళ విశేషాలను శాస్త్రీయ దృక్పథంతో వివరిస్తున్న తీరుపై నిమ్మల శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో దాగి ఉన్న విజ్ఞానాసక్తిని, పరిశోధనా తృష్ణను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఖగోళ వీక్షణ కార్యక్రమం ఈ నెల 27 వరకు కొనసాగుతుంది. ఫిబ్రవరి 28న “నేషనల్ సైన్స్ డే” పురస్కరించుకుని “రుద్రమ” అనే మోడల్ రాకెట్ లాంచింగ్‌ను నిర్వహించనున్నారు. ఈ అరుదైన అవకాశాన్ని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని, పిల్లలను పెద్ద సంఖ్యలో తీసుకువచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. శాస్త్రీయ అవగాహన పెంపొందించేందుకు యువ శాస్త్రవేత్తలు చేస్తున్న ఈ ప్రయత్నం నగర వాసుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.

# ‘తెలంగాణ రెండో యాదాద్రి’ కోటంచ

### లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న ఇనగాల



**వరంగల్ వాయిస్, రేగొండ :** తెలంగాణ రెండో యాదాద్రిగా పేరుగాంచిన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కోడవటంచ (కోటంచ) శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి దర్శించుకున్నారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆహ్వానం మేరకు ఆలయ పునఃప్రతిష్ఠ, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాల సందర్భంగా ఆయన ఈ పర్యటన చేపట్టారు. కుడా పీవో అజిత్ రెడ్డితో కలిసి ఆలయానికి చేరుకున్న ఇనగాల వెంకట్రామ్ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఆలయ చైర్మన్ నాయినేని సంపత్ రావులతో కలిసి ఆలయ పునర్నిర్మాణ పనులను, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం సుమారు రూ.82.25 కోట్ల నుంచి ₹86.30 కోట్ల భారీ వ్యయంతో ఈ ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిందని కొనియాడారు. నూతన గర్భాలయం, భక్తుల కోసం అధునాతన అతిథి గృహాలు, అంతర్గత రహదారులు, విశాలమైన పార్కింగ్ వసతులను కల్పించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ క్షేత్రం రాష్ట్రంలోనే ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# పోచమ్మ, పెద్దమ్మ తల్లి ఆలయాలకు భూమి పూజ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని, గ్రామాల్లో ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 45వ డివిజన్ పరిధిలోని తరాలపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామంలోని పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి, పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణానికి సంబంధించి ఏర్పాటు చేసిన భూమి పూజ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా ఆధ్యాత్మిక క్షేత్రాలను, సామాజిక వర్గాల కోసం సమూహ భవనాలను నిర్మించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధి కోసం ప్రజలందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తరాలపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే రాకతో ఉత్సాహంగా పనుల్లో భాగస్వాములయ్యారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బహుజన నేతలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బహుజన రాజ్యాధికార సమితి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోత సునీత కుమారుడు పోత శ్రీధర్ బాబు వివాహ వేడుక శుక్రవారం వరంగల్‌లోని పుష్పరాజ్ ఫంక్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, దళిత, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. ఈ శుభకార్యానికి ముఖ్య అతిథులుగా కేదాసి మోహన్ (ఎమ్మార్పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్), చాపర్తి కుమార్ గాడ్గే (రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు), చిలువేరు శ్రీనివాస్ (కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు), మాదాసి సురేష్ (ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్) హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, పోత సునీత కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ వేడుకలో ఒక ప్రత్యేకత సంతరించుకుంది. నూతన వధూవరులకు నాయకులు మహనీయుల చిత్రపటాలను బహూకరించి, వారి ఆదర్శాలను స్ఫురిస్తూ నూతన జీవితంలోకి అడుగుపెడుతున్న జంటకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు మాదాసి రతీష్, అమ్ముల అశోక్ యాదవ్, మాదాసి సుధాకర్, గనిపాక రాజకుమార్ తదితరులు పాల్గొని వధూవరులను దీవించారు.

# ‘ఓరుగల్లు కన్సల్టెన్సీ అసోసియేషన్’ లోగో ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** హనుమకొండ-వరంగల్ జంట నగరాల్లో విదేశీ విద్య, ఇమిగ్రేషన్ సేవలు అందిస్తున్న నిర్వాహకులు ఐక్యతకు నాంది పలుకుతూ ఏర్పాటు చేసిన ‘ఓరుగల్లు కన్సల్టెన్సీ అసోసియేషన్’ అధికారిక లోగోను వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకునే విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం అందించడం ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇలాంటి అసోసియేషన్లు ఏర్పడటం ద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులు మోసాలకు గురికాకుండా నమ్మకమైన సేవలు పొందవచ్చు. కన్సల్టెన్సీల మధ్య పరస్పర సహకారం పెరిగి, విదేశీ విద్యారంగంలో పారదర్శకత పెరుగుతుంది. పారదర్శకమైన సేవలు అందించే సంస్థలకు జిల్లా యంత్రాంగం నుండి తగిన గుర్తింపు ఉంటుందని ఆమె అభినందించారు. హనుమకొండ, వరంగల్ నగరాల్లోని వివిధ కన్సల్టెన్సీ ప్రతినిధులు ఒకే వేదికపైకి వచ్చి ఈ సంఘాన్ని స్థాపించినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడటం, వృత్తిపరమైన నైతిక విలువలను పాటించడం తమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అబ్రాడ్ కన్సల్టెన్సీ రంగంలో వినూత్న మార్పులు తీసుకువస్తూ, విద్యార్థులకు మరింత నాణ్యమైన సేవలు అందిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ కన్సల్టెన్సీ సంస్థల నిర్వాహకులు, ప్రముఖులు పాల్గొన్నారు.

# టీజీ ఎడ్. సెట్ నోటిఫికేషన్ విడుదల

**వరంగల్ వాయిస్, కేయూ :** రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ ఎడ్.సెట్ –2026 నోటిఫికేషన్ విడుదలయింది. ఈ మేరకు ఎడ్. సెట్ కన్వీనర్ ఆచార్య బి.వెంకట్రామరెడ్డి శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది కూడా బీఈడీ ప్రవేశ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ గా నిర్వహించనున్నట్లు కన్వీనర్ తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. రెండేళ్ల బీఈడీ 2026–27 కు ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు కాకతీయ విశ్వవిద్యాలయం లేదా నిర్దేశిత విభాగం ద్వారా నోటిఫికేషన్ వెలువడింది. అర్హత గల అభ్యర్థులు నోటిఫికేషన్‌లో సూచించిన తేదీల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు. దరఖాస్తు గడువు, పరీక్ష తేదీలు, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్ త్వరలోనే అందుబాటులోకి రానుంది.

# రైతు సంక్షేమమే మా లక్ష్యం

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- ఆకేరు వాగుపై రూ.65 లక్షలతో చెక్ డ్యామ్



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** వర్ధన్నపేట నియోజకవర్గ రైతాంగానికి సాగునీటి కష్టాలు తీర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని ఆకేరు వాగుపై రూ.65లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన చెక్ డ్యామ్ నిర్మాణం, మరమ్మత్తు పనులను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, పనుల్లో ఎక్కడా నాణ్యతా ప్రమాణాలు లోపించకూడదని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టరును, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. గత పదేళ్ల పాలనలో ఆకేరు వాగు అభివృద్ధిని పూర్తిగా పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాగు పునరుద్ధరణకు ప్రాధాన్యతనిచ్చి, తక్షణమే రూ.65 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ చెక్ డ్యామ్ వల్ల వర్ధన్నపేట పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో భూగర్భ జలమట్టం పెరుగుతుందని, వందలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని ధీమా వ్యక్తం చేశారు. వేసవి కాలంలో పశువులకు తాగునీటి కొరత తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, నీటిపారుదల శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# కేయూలో 'నీటి' ఘోష

- విద్యార్థి సంఘాల నిరసన




**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయంలోని పద్మాక్షి లేడీస్ హాస్టల్ 'సి' బ్లాక్ విద్యార్థినుల నీటి కష్టాలపై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. గత మూడు నెలలుగా నీటి సరఫరా లేక విద్యార్థినులు పడుతున్న ఇబ్బందులను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, పీడీఎస్ యూ ఆధ్వర్యంలో శుక్రవారం వర్సిటీ పరిపాలన భవనం ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షులు వంశీకృష్ణ మాట్లాడుతూ వర్సిటీ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మూడు నెలలుగా నీరు రాక విద్యార్థినులు బకెట్లు పట్టుకుని పక్క హాస్టళ్లకు వెళ్లాల్సి వస్తోందని, ఇది అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని విమర్శించారు. హాస్టళ్లలో వాష్రూమ్స్ శానిటైజేషన్ లేదని, వర్కర్లు రెగ్యులర్ గా రాకపోవడంతో హాస్టల్ గదులు అపరిశుభ్రంగా తయారయ్యాయని ఆరోపించారు. ఈ సమస్యపై హాస్టల్ డైరెక్టర్, రిజిస్ట్రార్, కేర్ టేకర్లకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని ధ్వజమెత్తారు. ధర్నా విషయం తెలుసుకున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం స్వయంగా విద్యార్థుల వద్దకు వచ్చి వారితో చర్చించారు. రెండు మూడు రోజుల్లో హాస్టల్‌లో నీటి సౌకర్యం సహా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏవైనా సమస్యలు ఉంటే విద్యార్థులు నేరుగా తన కార్యాలయానికి వచ్చి చెప్పవచ్చని సూచించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. అధికారులు ఇచ్చిన హామీ మేరకు రెండు రోజుల్లో సమస్య పరిష్కారం కాకుంటే వర్సిటీలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేయూ అధ్యక్ష కార్యదర్శులు చెన్నూరి సాయికుమార్, బిరెడ్డి జస్వంత్, నాయకులు రణదీప్, రాహుల్, సాయి, మల్లేష్, పవన్, విద్యార్థినులు ప్రవళిక, మౌనిక, శిరీష, అనూష పాల్గొన్నారు.

# 'ఏఐ' యుగంలో అవధాన పాండిత్యానికి పట్టాభిషేకం

- కేయూలో 'శతావధాన' మహోత్సవం
- ముఖ్య అతిథిగా మంత్రి కొండా సురేఖ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజ్యమేలుతున్న ప్రస్తుత కాలంలో.. మానవ మేధస్సుకు, ఏకాగ్రతకు, జ్ఞాపకశక్తికి అత్యున్నత పరీక్షగా నిలిచే 'అవధానం' ప్రక్రియకు కాకతీయ విశ్వవిద్యాలయం వేదిక కానుంది. వర్సిటీ స్వర్ణోత్సవాల సందర్భంగా కేయూ తెలుగు విభాగం, వరంగల్ కాకతీయ పద్య కవితా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22, 23, 24 తేదీల్లో శతావధానం ఘనంగా నిర్వహించనున్నట్లు పాలక మండలి సభ్యులు డా.చిర్రా రాజు తెలిపారు. శుక్రవారం వర్సిటీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఫిబ్రవరి 22న సెనెట్ హాల్‌లో జరిగే సభకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరవుతారు. విశిష్ట అతిథులుగా వీసీ ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి, ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కే.ఆర్.నాగరాజు, రిజిస్ట్రార్ ఆచార్య వి రామచంద్రం తదితరులు పాల్గొంటారు. మూడు రోజుల పాటు సాగే ఈ అక్షర యజ్ఞం కోసం చారిత్రక కవుల పేర్లతో వేదికలను సిద్ధం చేసినట్లు అవధాన విద్యా వికాస్ పరిషత్ అధ్యక్షులు మరుమముల దత్తాత్రేయ శర్మ తెలిపారు. ప్రధాన ప్రాంగణానికి "బమ్మెర పోతన ప్రాంగణం" అని పేరు పెట్టారు. వేదికలకు పాల్కురికి సోమనాథ, కోవెల సుప్రసన్న, ఇంద్రపు కిషన్ రావు మరియు చిలకమర్రి రామానుజాచార్యుల పేర్లను నిర్ణయించారు. ఈ శతావధానంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 100 మందికి పైగా పండితులు 'ప్రశ్నికులు'గా పాల్గొననున్నారు. విద్యార్థులు రేపటి అవధానులుగా ఎదిగేందుకు ఈ వేదిక ఉపకరిస్తుందని అవధాన ప్రియుడు చేపురి శ్రీరామ్ పేర్కొన్నారు. విభాగాధిపతి డా.మామిడి లింగయ్య మాట్లాడుతూ, సాహిత్య పరంపరను తెలుసుకునేందుకు విద్యార్థులంతా రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే ఉపాధ్యాయులకు ఆన్-డ్యూటీ సౌకర్యం కల్పించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ ఆచార్య టి.మనోహర్, విభాగ అధ్యాపకులు డా.కర్రే సదాశివ, అక్కెర కరుణా సాగర్, జీడికంటి శ్రీనివాస మూర్తి, వెలుగు ప్రభాకర్, గొట్టి ముక్కుల గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'సర్వోదయ చరక' శిక్షణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 'సర్వోదయ చరక సంఘటన' శిక్షణా కార్యక్రమం శుక్రవారం అత్యంత ఉత్సాహంగా జరిగింది. డీసీసీ అధ్యక్షుడు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి మార్గదర్శకత్వంలో ప్రతి శుక్రవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా, ఈ వారం పలువురు నాయకులు శిక్షణ పొందారు. ఈ శిక్షణలో పాల్గొన్న పరకాల ఎస్సీ విభాగం అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు బొచ్చు జెమిని మాట్లాడుతూ, మహాత్మా గాంధీ స్వాతంత్ర ఉద్యమ కాలంలో చరకను ఏ ఉద్దేశంతోనైతే సంకల్పించారో, అదే స్ఫూర్తిని నేటి తరానికి అందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. చరక శిక్షణ ద్వారా కార్యకర్తలలో క్రమశిక్షణతో పాటు నాయకత్వానికి అవసరమైన దృఢత్వం లభిస్తుందని వారు తెలిపారు. శిక్షకులు ప్రియాంక, భాగాది రమేష్‌లు చరక నిర్వహణ, దాని వెనుక ఉన్న సామాజిక ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కోవడానికి, ప్రజల్లోకి పార్టీ సిద్ధాంతాలను బలంగా తీసుకెళ్లడానికి ఇలాంటి శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ సాగర్, పరకాల నియోజకవర్గ నాయకులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి పెద్దపీట



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** వ్యవసాయ రంగంలో యాంత్రీకరణను ప్రోత్సహించి, రైతుపై పెట్టుబడి భారాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. శుక్రవారం స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్సిడీ వ్యవసాయ పనిముట్ల పంపిణీ కార్యక్రమానికి వారు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషాతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా మాట్లాడుతూ, జిల్లాకు మొత్తం 3,320 యూనిట్లు మంజూరు కాగా, ఒక్క స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికే 1,600 యూనిట్లు కేటాయించామని తెలిపారు. మార్చి లోపు రైతులు దరఖాస్తు చేసుకోవాలని, పాస్ బుక్ ఉన్న ప్రతి రైతు విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పింకేష్, ఆర్డీఓ వెంకన్న, జిల్లా వ్యవసాయ అధికారి, డీఆర్డీఏ పీడీ వాసంతి, మున్సిపల్ ఛైర్మన్ వినయ్, కౌన్సిలర్లు, వివిధ మండలాల రైతులు పాల్గొన్నారు.

## జన్నరపు దేవక్కకు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర విభాగ పరిశోధకురాలు జన్నరపు దేవక్క డాక్టరేట్ పట్టా అందుకున్నారు. వరంగల్ జిల్లా నడికూడ మండలం కౌకొండ గ్రామానికి చెందిన దేవక్క చేసిన పరిశోధనను గుర్తించిన విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, ఆమెకు పీహెచ్‌డీ ప్రధానం చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దేవక్క "ఎనర్జీ రెక్వైర్మెంట్ అండ్ ఎనర్జీ ఎఫిషియన్సీ ఇన్ పాడీ కల్టివేషన్ – ఎ స్టడీ ఇన్ తెలంగాణ స్టేట్" అనే అంశంపై తన పరిశోధనను పూర్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో వరి సాగులో శక్తి వినియోగం, దాని సామర్థ్యం, రైతులపై పడుతున్న ప్రభావం గురించి ఈ పరిశోధనలో లోతుగా విశ్లేషించారు. ఈ పరిశోధన కాకతీయ విశ్వవిద్యాలయ అర్థశాస్త్ర విభాగ ఆచార్యులు ఆచార్య బి.సురేష్ లాల్ పర్యవేక్షణలో దిగ్విజయంగా పూర్తయింది. ఒక సామాన్య గ్రామీణ నేపథ్యం నుండి వచ్చి, వ్యవసాయ రంగానికి సంబంధించిన కీలక అంశంపై డాక్టరేట్ సాధించడం పట్ల తోటి పరిశోధకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. డాక్టరేట్ సాధించిన జన్నరపు దేవక్కను విశ్వవిద్యాలయ బోధనా, బోధనేతర సిబ్బందితో పాటు పరిశోధకులు, విద్యార్థులు, ఆమె స్వగ్రామమైన కౌకొండ గ్రామస్తులు ఘనంగా అభినందించారు.

# పేదల ఇళ్లు కూలిస్తే చూస్తూ ఊరుకోం

## ◆ కాంగ్రెస్ ప్రభుత్వానికి దాస్యం హెచ్చరిక



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అధికార గర్వంతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పొట్ట కొడుతోందని, అభాగ్యులకు అన్యాయం చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ హెచ్చరించారు. భద్రకాళి దేవస్థానం సమీపంలోని చెరబండ రాజు కాలనీ వాసులకు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ అండగా నిలిచిందని, కాలనీవాసులపై వేధింపులు ఆపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిందని ఆయన వెల్లడించారు. శుక్రవారం కాలనీవాసులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ రెండేళ్ల పాలనపై నిప్పులు చెరిగారు. దళితులు గుడిసెలు వేసుకోవడం తప్పా? అని ప్రశ్నించారు. పేదలకు నీళ్లు, కరెంటు కట్ చేస్తూ, ఇళ్లు కూల్చుతామని బెదిరించడం దుర్మార్గమన్నారు. కేసీఆర్ 10ఏళ్లలో 500 పైగా సంక్షేమ పథకాలు అమలు చేస్తే, కాంగ్రెస్ 420 హామీలను, 6 గ్యారంటీలను తుంగలో తొక్కిందని మండిపడ్డారు. దళిత నాయకులపై అక్రమ అరెస్టులు, దాడులు చేస్తూ నీచమైన రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి లక్ష్యంగా వినయ్ భాస్కర్ తీవ్ర విమర్శలు చేశారు. "నాయిని.. నీ నిజస్వరూపం బయటపడుతోంది. వెకిలి చేష్టలు మానుకో. అభివృద్ధిపై నీకు నమ్మకముంటే, నాపై చేసిన విమర్శలు నిజమని భావిస్తే రాజీనామా చెయ్. మళ్లీ ఎన్నికలకు వెళ్దాం.. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా" అని సవాల్ విసిరారు. పైరవీలు చేయడం మానుకుని, పేదలకు పట్టాలు ఇవ్వాలని, వారి సమస్యలను మనసుతో వినాలని సూచించారు. చెరబండ రాజు కాలనీ వాసుల సమస్యపై స్పందించి, జిల్లా ఉన్నతాధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసిన మానవ హక్కుల కమిషన్ చైర్మన్ అక్తర్ కి, న్యాయపోరాటం చేసిన బీఆర్ఎస్ లీగల్ సెల్ సభ్యులకు వినయ్ భాస్కర్ ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ప్రజల సమస్యలను పరిష్కరించే 'జనతా గ్యారేజ్' లా పనిచేస్తుందని, అధికారం ఉన్నా లేకున్నా తాను ప్రజల వెంటే ఉండి పోరాడుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గులాబీ శ్రేణులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాలువల పూడికతీత పనుల ప్రారంభం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** బొమ్మకూర్ రిజర్వాయర్ నుంచి మెయిన్ కెనాల్ ద్వారా మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు సక్రమంగా అందేలా చూడాలని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇచ్చిన ఆదేశాల మేరకు కాలువల పూడికతీత పనులు వేగవంతంగా సాగుతున్నాయి. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల శివారులో కెనాల్ కాలువల్లో అడ్డుగా ఉన్న తుంగ, చెత్తాచెదారం తొలగించే కార్యక్రమాన్ని నాయకులు, రైతులు కలిసి చేపట్టారు. మేకల గట్టు, ఆంధ్ర తండా, గిద్ద బండ తండా, పొట్టి గుబ్బెడి తండా, మంగలి బండ తండా, కొత్తగూడెం, ఖిలా షాపూర్ గ్రామాలకు నీరు చేరే కాలువలు గుర్రపుడెక్క, తుంగతో నిండిపోయి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడింది. ఈ విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే వెంటనే స్పందించి పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు స్వయంగా పర్యవేక్షించి, రైతులతో కలిసి పనులను వేగవంతం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లింగాల జగదీష్ రెడ్డి, నాయకులు కోళ్ల రవి గౌడ్, నాముల బుచ్చయ్య, గేద మహేందర్ రెడ్డి, మంగళ బండ తండా సర్పంచ్ గుగులోతు రామ్ చందర్ నాయక్, మాజీ సర్పంచ్ కుంకీస్ ప్రకాష్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కుంకీస్ బాల్ రెడ్డిలతో పాటు రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రైతుల ఇబ్బందులను గుర్తించి సకాలంలో స్పందించి, కాలువలను శుభ్రం చేయించడంలో చొరవ చూపిన మారుజోడు రాంబాబుకు, సహకరించిన నాయకులకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# దేవాదుల పంప్ హౌస్ పరిశీలన

## బీఆర్ఎస్ నేతల క్షేత్రస్థాయి పర్యటన



**వరంగల్ వాయిస్, హనుమకొండ/వర్ధన్నపేట :** వర్ధన్నపేట నియోజకవర్గం, గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ పరిధిలోని దేవన్నపేట గ్రామంలో గల జువ్వాడి చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం (3×31MW ఫేజ్–3 పంప్ హౌస్)ను బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి శ్రీ హరీష్ రావు శుక్రవారం సందర్శించారు. వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ తో కలిసి ఆయన ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంప్ హౌస్ పనితీరు, నీటి నిల్వ సామర్థ్యం మరియు ఫేజ్–3 ద్వారా సాగునీటి సరఫరాపై అధికారులతో చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ కార్యక్రమంలో హరీష్ రావు గారు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో నిర్మించామని, రైతులకు సాగునీరు అందించడంలో ఈ పంప్ హౌస్ కీలకంగా మారిందని గుర్తుచేశారు. ఈ పర్యటనలో హరీష్ రావు, అరూరి రమేష్ తో పాటు మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు నాగూర్ల వెంకన్న, ఎర్రోళ్ల శ్రీనివాస్, మర్రి యాదవ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బడ్జెట్‌లో బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలి

## ◆ తాటిపాముల వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు చట్టబద్ధంగా సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి, ప్రత్యేక నిధులు కేటాయించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, నాయకులు కట్కోజు చంద్రశేఖర్, చెలుకల రాజు, ఎల్. రామకృష్ణలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదని వెంకట్రాములు విమర్శించారు. ఐదేళ్లలో లక్ష కోట్లు (ఏటా రూ. 20 వేల కోట్లు) కేటాయిస్తామని చెప్పి, మొదటి బడ్జెట్‌లో కేవలం రూ. 9,200 కోట్లు, రెండో బడ్జెట్‌లో రూ. 11,405 కోట్లు మాత్రమే చూపించారని మండిపడ్డారు. కేటాయించిన అరకొర నిధులను కూడా పూర్తిస్థాయిలో ఖర్చు చేయకుండా బీసీలను ప్రభుత్వం వంచిస్తోందని ధ్వజమెత్తారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వం అన్ని రంగాల్లో ద్రోహం చేస్తోందని ఆయన ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి మోసం చేశారని, కార్పొరేషన్ పదవుల్లోనూ బీసీలకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే మూడవ బడ్జెట్‌లోనైనా బీసీల పట్ల చిత్తశుద్ధి చాటుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో తగ్గించిన నిధులను కలుపుకుని ఈ బడ్జెట్‌లో రూ. 39,395 కోట్లు కేటాయించాలి. బీసీ సబ్ ప్లాన్‌కు వెంటనే చట్టబద్ధత కల్పించాలి. కులవృత్తిదారులను ఆదుకునేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. తమ డిమాండ్లు నెరవేర్చని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీల ఐక్య ఉద్యమాలను ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని వెంకట్రాములు హెచ్చరించారు.

# మేడారం జాతరపై పుస్తకం విడుదల



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ "గాడెస్ ఆఫ్ ఫోక్" పేరుతో మేడారం జాతరపై ప్రచురించిన ప్రచురణను గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ డి.అనసూయ శుక్రవారం విడుదల చేశారు. అరుదైన ఛాయాచిత్రాలతో పుస్తకాన్ని సంకలనం చేసిన ప్రముఖ చిత్రనిర్మాత బి.నర్సింగ్ రావు, ట్రస్ట్ సభ్యులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు బీపీ.ఆచార్య, బీవీ.పాపారావు, రిటైర్డ్ ఎన్ఐటీ ప్రొఫెసర్ పాండురంగారావు, కె.శ్రీధర్, రిటైర్డ్ డీజీపీ ఎం.రతన్ జె పూలే ప్రజా భవన్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. ట్రస్ట్ చేసిన కృషిని మంత్రి ప్రశంసించారు. సమ్మక్క సారలమ్మ జాతరను యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించడానికి అవసరమైన ప్రతిపాదనను సిద్ధం చేయాలని కోరారు.

# కేయూలో 'పరిచయ్–2026'

## వినూత్నంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయంలోని సామాజిక శాస్త్రం, సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'పరిచయ్–2026' ఫ్రెషర్స్ కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు వేదికగా నిలిచింది. కేవలం వేడుకలకే పరిమితం కాకుండా, కొత్తగా చేరిన విద్యార్థులతో మొక్కలు నాటించి ప్రకృతి పట్ల బాధ్యతను చాటుకున్నారు.ఈ కార్యక్రమం కోసం 'పుడమితల్లి' స్వచ్ఛంద సంస్థ అందించిన 50 మొక్కలను విద్యార్థులు, అధ్యాపకులు కలిసి క్యాంపస్ ఆవరణలో నాటారు. ఈ సందర్భంగా విభాగ అధిపతి ప్రొఫెసర్ ఎం.స్వర్ణలత మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే మానవ మనుగడకు ప్రాధాన్యతనిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యా ప్రయాణం ఒక మొక్కతో ప్రారంభించడం వారిలో సామాజిక బాధ్యతను పెంచుతుందని తెలిపారు. ఈ 'పచ్చని ఆరంభం' కొత్త విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ప్రొఫెసర్ కె.ఐలయ్య, విభాగ అధ్యాపకులు రజిత, జాస్మిన్, సాహితి, సుభాష్, వాసు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పుడమితల్లి సంస్థ వ్యవస్థాపకుడు వేణుగోపాల్‌తో పాటు సభ్యులు వినయ్ కుమార్, మహేష్, వైష్ణవి, హిమబిందు మొక్కలు నాటే కార్యక్రమంలో చురుగ్గా వ్యవహరించారు. క్యాంపస్‌లో పండుగ వాతావరణం మధ్య పర్యావరణ స్పృహను పెంపొందించేలా సాగిన ఈ కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది.

# విజయ్ కుమార్ కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రెంట్యాల గ్రామానికి చెందిన బిగ్ టీవీ అధినేత వెన్నం విజయ్ కుమార్, శ్రీకాంత్ రెడ్డిల తండ్రి రాఘవేంద్ర రెడ్డి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసి, పలువురు ప్రముఖులు వారి కుటుంబాన్ని పరామర్శించారు. శుక్రవారం రెంట్యాల గ్రామంలోని విజయ్ కుమార్ స్వగృహానికి చేరుకున్న అల్లం ప్రదీప్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విజయ్ కుమార్, ఆయన కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. రాఘవేంద్ర రెడ్డి మరణం పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఈ పరామర్శించిన వారిలో అల్లం ప్రదీప్ రెడ్డితో పాటు టీవీ 9 వంశీ, ఈటీవీ శ్రీకాంత్, ఎన్ టీవీ సాంబశివ, తదితరులు హాజరై శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# శ్రీ వరద దత్త క్షేత్రంలో 'సభా మండపం' శంకుస్థాపన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ ములుగు రోడ్డులోని శ్రీ గణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. అవధూత దత్త పీఠం నుంచి విచ్చేసిన బ్రహ్మశ్రీ కళ్యాణ్ శర్మ పర్యవేక్షణలో గత రెండు రోజులుగా క్షేత్రంలో విశేష పూజా కార్యక్రమాలు, శంకుస్థాపన మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం క్షేత్ర ఆవరణలో శ్రీ గణపతి సచ్చిదానంద సభా మండప నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. అంతకుముందు బ్రహ్మశ్రీ కళ్యాణ్ శర్మ పర్యవేక్షణలో లోక కల్యాణార్థం హనుమత్ హోమాన్ని నిర్వహించారు. శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి వారిని తాత్కాలికంగా వేరే చోట ప్రతిష్టించే 'కళాపకర్షణ' కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పలువురు ప్రముఖులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి సురేందర్ పాల్గొని సభా మండప పనులకు భూమి పూజ చేశారు. కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి ఆశ్రమాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రెండు రోజుల వేడుకల్లో వరంగల్ నగరం నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దత్త భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వచ్చిన భక్తులందరికీ ఆశ్రమ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు, అల్పాహార వితరణ చేశారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసినందుకు ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వై.వి.వామన్ రావు, (ఎస్ జీఎస్ దత్త జ్ఞాన బోధ సభ ట్రస్ట్) భక్తులకు, ప్రముఖులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ వేడుకల్లో ట్రస్ట్ సభ్యులు, స్వచ్ఛంద సేవకులు చురుగ్గా పాల్గొన్నారు.

# బాలల సంక్షేమమే లక్ష్యం



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు మర్రిపెల్లి చందన, గోగుల సరితల బృందం శుక్రవారం వరంగల్ జిల్లాలో విస్తృతంగా పర్యటించింది. బాలల హక్కుల రక్షణ, విద్యా, వైద్యం, పోషకాహార సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఇక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పిల్లలకు అందుతున్న పోషకాహారంపై ఆరా తీశారు. కిచెన్ షెడ్ల వద్ద పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని, గ్రౌండ్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. శిథిలావస్థలో ఉన్న గదిని తొలగించేలా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్‌ఎం రమేష్ బాబుకు హామీ ఇచ్చారు. క్లస్టర్ మీటింగ్‌లో పాల్గొన్న సభ్యులు.. బాల్య వివాహాల నిర్మూలనకు ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. చెన్నారావుపేట కేజీబీవీ పాఠశాల పర్యటనలో విద్యార్థినులు తమ సమస్యలను కమిషన్ దృష్టికి తెచ్చారు. కోతుల బెడద ఎక్కువగా ఉందని, అలాగే విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా డైనింగ్ హాల్ సౌకర్యం లేదని (కేవలం 120 మందికే సరిపోతుందని) వివరించారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని సభ్యులు హామీ ఇచ్చారు. నర్సంపేటలోని అనాథ బాలల ఆశ్రమాన్ని సందర్శించి, అక్కడ పిల్లలకు కల్పిస్తున్న వసతులపై హర్షం వ్యక్తం చేశారు. నిర్వాహకులు డాక్టర్ మోహన్ రావు దంపతులను అభినందించారు. ఆసుపత్రిలోని మాతా శిశు సంరక్షణ విభాగం, నవజాత శిశువుల వార్డులను తనిఖీ చేశారు. శిశు మరణాలు సంభవించకుండా మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ సాంబశివరావును ఆదేశించారు.ద్వారకపేట రోడ్డులోని స్కూల్‌ను సందర్శించి, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్‌పర్సన్ కే.వసుధ, సభ్యులు సుజాత, షాహిదా బేగం, మధు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి కే.ఉమా, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ బొజ్జ కల్పన, ఎంఈఓలు రవీందర్, సారయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా 'సీఎం కప్–2025' ప్రారంభం

- గ్రామీణ క్రీడాకారులకు అంతర్జాతీయ వేదిక
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- హాజరైన ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ స్నేహ శబరీష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** "రూరల్ టు గ్లోబల్ – క్రాఫ్టింగ్ ఛాంపియన్స్" అనే ఉత్తేజకరమైన నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చీఫ్ మినిస్టర్స్ కప్–2025 (ఎడిషన్–2) క్రీడోత్సవం హనుమకొండలోని జేఎన్ఎస్ గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ రెండో ఎడిషన్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలు కేవలం శారీరక దారుఢ్యాన్ని



మాత్రమే కాకుండా, యువతలో క్రమశిక్షణ, పట్టుదల మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. క్రీడలను కెరీర్‌గా ఎంచుకునే యువతకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఈ వేదికను సద్వినియోగం చేసుకుని రాష్ట్రానికి, దేశానికి కీర్తి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రారంభోత్సవం సందర్భంగా క్రీడాకారుల కవాతు, ఉత్సాహభరితమైన వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి అశోక్, ఏసీపీ నర్సింగరావు, ప్రముఖులు సారంగపాణి, ప్రభాకర్ రెడ్డిలతో పాటు కోచ్‌లు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. వచ్చే కొన్ని రోజుల పాటు సాగే ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకోనున్నారు.

# 'సంరక్ష'లో డీఎన్‌బీ ఆర్థో కోర్సు ప్రారంభం

- గుజరాత్, తమిళనాడు విద్యార్థుల చేరిక
- నీట్ పీజీ ద్వారా ఎంపికైన విద్యార్థులకు శిక్షణ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని సంరక్ష సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్య విద్యారంగంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. జాతీయ స్థాయి నీట్ పీజీ పరీక్ష ద్వారా ప్రతిష్టాత్మకమైన డీఎన్ బీ (డిప్లమేట్ ఆఫ్ నేషనల్ బోర్డు) ఆర్థోపెడిక్ కోర్సులో ఎంపికైన ఇద్దరు విద్యార్థులు శుక్రవారం హాస్పిటల్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రాంకుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను సాదరంగా ఆహ్వానించారు. ఈ మూడేళ్ల డీఎన్ బీ కోర్సు కోసం ఈ ఏడాది గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సంరక్ష హాస్పిటల్‌ను ఎంచుకోవడం విశేషం. గత ఏడాది కూడా న్యూఢిల్లీకి చెందిన విద్యార్థి ఇక్కడ జాయిన్ అయ్యారు. ఇతర రాష్ట్రాల విద్యార్థులు వరంగల్‌లోని ఈ హాస్పిటల్‌ను ఎంచుకోవడం ఇక్కడి వైద్య సేవల నాణ్యతకు, బోధనా సామర్థ్యానికి నిదర్శనమని డాక్టర్ రాంకుమార్ రెడ్డి కొనియాడారు. ఈ కోర్సులో చేరిన విద్యార్థులకు అనుభవజ్ఞులైన వైద్య బృందం పర్యవేక్షణలో శిక్షణ లభించనుంది. హెచ్.ఓ.డి (ఆర్థో), తెలంగాణ ఆర్థో అసోసియేషన్ కోశాధికారి డాక్టర్ దిడ్డి శ్రవణ్ కుమార్, ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ దయాసాగర్, వీరితో పాటు హాస్పిటల్ మేనేజ్మెంట్, సీనియర్ డాక్టర్ల పర్యవేక్షణలో విద్యార్థులకు క్లినికల్, ప్రాక్టికల్ శిక్షణ అందనుంది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ లక్ష్మీ నారాయణ, డాక్టర్ ప్రసాద్ రెడ్డి, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ దినేష్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ దిడ్డి రమేష్ కుమార్, డాక్టర్ బందెల మోహన్ రావు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# 28న మహిళా న్యాయవాదుల రాష్ట్ర స్థాయి సదస్సు

- జయప్రదం చేయాలని బార్ అసోసియేషన్ పిలుపు
- గోడ పత్రికలు, కరపత్రాల ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** న్యాయ వ్యవస్థలో మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సవాళ్లు, వృత్తిపరమైన అభివృద్ధి, వారి రక్షణపై చర్చించేందుకు ఈ నెల 28న నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలస సుధీర్, పులి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ సదస్సు గోడ పత్రికలను, కరపత్రాలను శుక్రవారం హనుమకొండ జిల్లా కోర్టు ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. సమాజంలో సగభాగమైన మహిళలు న్యాయ వృత్తిలో రాణిస్తున్నప్పటికీ, ఇంకా వివక్షను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా న్యాయవాదులంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను, సమాన అవకాశాలను పొందాలని కోరారు. ఐఎల్పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్ మాట్లాడుతూ సదస్సు వివరాలను వెల్లడించారు. ప్రధాన అతిథిగా రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, విశిష్ట అతిథులుగా జస్టిస్ తిరుమలదేవి ఈడ, ఐఎల్పీఏ జాతీయ అధ్యక్షురాలు సుజాత చౌదరి, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ జి.రాధారాణి 'న్యాయ వ్యవస్థలో పితృస్వామ్య స్వభావం – పరిష్కారాలు' అనే అంశంపై సందేశం ఇస్తారు. న్యాయవాదుల రక్షణ చట్టం ఆవశ్యకతపై ఆర్.గంగాభవాని, ఉన్నత న్యాయస్థానాల్లో మహిళా న్యాయమూర్తుల నియామకం, బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మహిళా కోటాపై రిటైర్డ్ అధికారి పి.సత్యనారాయణ మూర్తి ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రేవూరి శశిరేఖ, ఐఎల్పీఏ నాయకులు చిల్ల రాజేంద్రప్రసాద్, సురేందర్ గౌడ్, పూసపల్లి శ్రీనివాస్, పెద్ద సంఖ్యలో మహిళా న్యాయవాదులు రమాదేవి, ఉమా గౌడ్, శ్రీలత, పద్మ యాదవ్, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.




# ముంబైలో ఉండి. .చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టా

## కపుల్ ఫ్రెండ్లీ మరో గీతాంజలి అంటూ ప్రభాస్ కితాబు


నటుడు ప్రభాస్ ఫుడ్ లవర్...ఆయన వెరైటీ ఫుడ్ ఇష్టపడతారు. అందరికీ నా ఫుడ్ గురించి తెలుసుకోవాలని ఉంటుంది. మీకో ఆసక్తికర విషయం చెబుతాను. నేను అప్పుడప్పుడు వేరే రాష్ట్రాల నుంచి ఫుడ్ ఆర్డర్ పెడతాను. 'ఆదిపురుష' షూటింగ్ ముంబయిలో జరిగేటప్పుడు చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టా. టీమ్ అందరూ షాక్ అయ్యారు. ఫ్లైట్ లో ఆర్డర్ తీసుకొచ్చిన వ్యక్తి నా దగ్గరకు వచ్చి మీరు మాములు వాళ్లు కాదండీ' అంటూ చేసిన కామెంట్స్‌ను ప్రభాస్ గుర్తుచేసుకున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' చూసి ఆ ఫీల్ నుంచి బయటకు రావడానికి చాలాసేపు పట్టిందని అగ్రనటుడు ప్రభాస్ అన్నారు. చివరి 20 నిమిషాలు మరో స్థాయిలో ఉందని ప్రశంసించారు. తాజాగా ఈ మూవీ టీమ్ ప్రభాస్‌ను కలిసింది. ఆ చిత్ర బృందంతో ప్రభాస్ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. నాకు 'గీతాంజలి' అంటే చాలా ఇష్టం. అందరూ నాకు యాక్షన్ చిత్రాలంటే ఇష్టమనుకుంటారు. ప్రత్యేకించి మణిరత్నం అభిమానిని అంటూ 'కపుల్ ఫ్రెండ్లీ' చూసినప్పుడు నాకు 'గీతాంజలి' చూస్తున్న ఫీల్ కలిగింది. అందుకే నాలుగు సార్లు చూడాలని నిర్ణయించుకున్నానన్నారు. ఆయన 'బుజ్జిగాడు' కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఎలా చేయాలి అని టెన్షన్ వచ్చింది. తర్వాత ఆయన దర్శకత్వంలో 'ఏక్ నిరంజన' చేశా. ఆయనలా డైలాగులు రాసేవాళ్లు ప్రపంచంలోనే లేరు. ఆయనది ఒక ప్రత్యేకమైన శైలి. మీ దృష్టిలో ప్రేమంటే ఏంటి?' అని హీరోయిన్ మానస వారణాసి అడగ్గా.. పర్సనల్ క్వశ్చన్ కదా అంటూ ప్రభాస్ నవ్వులు పూయించారు. లవ్ అనగానే ప్రస్తుతానికి 'కపుల్ ఫ్రెండ్లీ' గుర్తొస్తుందన్నారు.

# యశ్ టాక్సిక్ టీజర్ విడుదల




యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక'. 'ఫెయిరీటేల్ ఫర్ గ్రోనఅప్స' అనేది ఉప శీర్షిక. ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజెబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా, మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. మార్చి 19న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను విడుదల చేశారు. విరోధం పెట్టుకొని బతకలేవు.. పట్టుదల వదిలేయ్ అనే డైలాగులతో మోస్ట్ వైలెంట్‌గా రాయాపాత్రలో యశ కనిపించారు.

# ఉస్తాద్ నుంచి 22న మరో సాంగ్ విడుదల



గబ్బర్‌సింగ' తర్వాత పవన్ కల్యాణ్ `డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ'. మార్చి 26న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌లో జోష్ పెంచింది. ఇప్పటికే ఓ పాటను రిలీజ్ చేయగా.. తాజాగా 'ఆరా ఆఫ్ ఉస్తాద' సాంగ్ ప్రోమోను పంచుకుంది. పూర్తిపాటను ఈ నెల 22న విడుదల చేయనుంది. విజువల్స్, మ్యూజిక్‌ని బట్టి ఈ సాంగ్ పవర్‌ఫుల్‌గా ఉండనున్నట్లు తెలుస్తోంది.

# కామెడీ ట్రాక్‌లో హే బలవంత్..



ప్రేక్షకులను అలరిస్తే చాలు పెద్ద స్టార్ కాస్ట్ లేకపోయినా చిన్న సినిమాలు కూడా థియేటర్లలో రాణిస్తాయి. ఇటీవల 'లిటిల్ హార్ట్స', 'రాజు వెడ్స్ రాంబాయి' విజయాలే దానికి నిదర్శనం. ఆ సినిమాలను విడుదల చేసిన బన్నీ వాస్, వంశీ నందిపాటి మరోసారి కలిసి సుహాస్ నటించిన 'హే బల్‌వంత' చిత్రాన్ని తీసుకొచ్చారు. సీక్రెట్ బిజినెస్ కాన్సెప్ట్‌తో చేసిన ప్రమోషన్స్ ఈ సినిమాపై ఆసక్తిని పెంచాయి. కృష్ణ (సుహాస్) చిన్నప్పటి నుంచే తండ్రి బల్‌వంత్ (నరేష్) చేస్తున్న బిజినెస్ చేయాలని నిర్ణయించుకుంటాడు. కానీ ఆ వ్యాపారం ఏమిటో అతనికి తెలియదు. దాన్ని దాచేందుకు బలవంత్ అతడిని బోర్డింగ్ స్కూల్‌లో పెడతాడు. చదువు పూర్తయ్యాక ఇంటికి వచ్చిన కృష్ణ, అనారోగ్యానికి గురైన తండ్రి స్థానంలో బిజినెస్ బాధ్యతలు తీసుకోవడానికి ఆఫీస్‌కు వెళ్తాడు. ఆ వ్యాపారాన్ని కళ్లారా చూసిన అతనికి పెద్ద షాక్ ఎదురవుతుంది. ఇంతకీ ఆ బిజినెస్ ఏమిటి? ఆ వ్యాపారం అతని ప్రేమ, తండ్రితో ఉన్న బంధాలపై ఎలాంటి ప్రభావం చూపిందనేదే కథ.నవ్విస్తూనే మనసులను హత్తుకునే కథ చెప్పాలనే ప్రయత్నం చేశాడు దర్శకుడు గోపి అచ్చర. ఈ ప్రయత్నం చాలా వరకు సక్సెస్ అయ్యింది. ఫస్ట్ హాఫ్‌లో సీక్రెట్ బిజినెస్ కామెడీ బాగా వర్క్ అవుతుంది. కృష్ణ బిజినెస్ ఐడియాలు, లవ్ ట్రాక్ సరదాగా సాగుతాయి. ఇంటర్వెల్‌కు ముందు వచ్చే ప్రకృతి వైద్యం ఎపిసోడ్ మంచి నవ్వులు పంచుతుంది. సుహాస్, సుదర్శన్, వెన్నెల కిశోర్ కలిసి చేసిన కామెడీ ట్రాక్ హైలెట్‌గా నిలుస్తుంది. ఇంటర్వెల్ ట్విస్ట్ కథపై ఆసక్తిని మరింత పెంచుతుంది. సీక్రెట్ బిజినెస్ నేపథ్యంతో సాగిన కథ సెకండ్ హాఫ్‌లో కిడ్నాప్ డ్రామా వైపు మళ్లుతుంది. వెన్నెల కిశోర్ లవ్ ట్రాక్, అజయ్ ఘోష్ ఇంట్లో జరిగే సన్నివేశాలు వినోదాన్ని అందిస్తాయి. డెడ్ బాడీ చుట్టూ నడిచే ఎపిసోడ్ ఇంకా బెటర్ గా వుండాల్సింది. చివరి ఇరవై నిమిషాల్లో తండ్రి `కొడుకుల భావోద్వేగాన్ని బలంగా చూపించాలనే ప్రయత్నం ఆకట్టుకునేలా ఉంటుంది. సుహాస్ తనకు సూటయ్యే పాత్రలో మరోసారి మెప్పించాడు. కామెడీతో పాటు ఎమోషన్ సీన్స్‌లో కూడా ఆకట్టుకున్నాడు. శివానీ నాగారం మిత్ర పాత్రలో ఉత్సాహంగా కనిపించింది. నరేష్‌కు ఇచ్చిన ఎలివేషన్ సన్నివేశాలు వినోదంగా ఉంటాయి. సుదర్శన్ కామెడీ టైమింగ్ బాగా వర్క్ అయ్యింది. వెన్నెల కిశోర్, హర్ష వర్ధన్, అజయ్ ఘోష్ పాత్రలు కథకు వినోదాన్ని జోడించాయి. వివేక్ సాగర్ సంగీతంలో పాటలు అంతగా గుర్తుండకపోయినా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కొన్ని సన్నివేశాలకు బలం ఇచ్చింది. సినిమాటోగ్రఫీ డీసెంట్‌గా ఉంది. ఎడిటింగ్ పదునుగానే వుంది. కథకు తగ్గ నిర్మాణ విలువలు కనిపించాయి.



# డాటర్ ఆఫ్ ప్రసాదరావు ట్రైలర్ విడుదల




రాజీవ్ కనకాల, ఉదయభాను, వసంతిక, శ్రీరామ్ వెంకట్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు'. త్వరలోనే ఈ మూవీ విడుదల కాబోతోంది. 'రెక్కీ', 'విరాటపాలెం' మేకర్స్ నుంచి రాబోతోన్న మరో ఆసక్తికర థ్రిల్లర్ మూవీ ఇది. కష్ట పోలూరు దర్శకత్వం వహించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 27 నుంచి జీ5లో స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ క్రమంలో ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు.

# మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

- తాగు నీరు, పారిశుధ్య పనులకు అధిక ప్రాధాన్యం
- పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** వచ్చే ఐదేళ్లలో మనందరం కలిసి స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీని మాడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసుకుందామని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్వహించిన స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ మొదటి సర్వసభ్య సమావేశానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సమావేశంలో పట్టణ అభివృద్ధి, మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల అభివృద్ధి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు.

మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, అధికారులు పట్టణాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలైన తాగు నీటి సరఫరా, పారిశుధ్యం సమస్యల పరిష్కారానికి పలు ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని అన్నారు. స్టేషన్ ఘనపూర్‌ను 'మోడల్ మున్సిపాలిటీ'గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చేపట్టే ప్రతి అభివృద్ధి పని భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ప్రజా సమస్యలను నోటి మాటగా కాకుండా డాక్యుమెంటేషన్‌తో అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని 18 ప్రధాన అంశాలపై సుదీర్ఘంగా చర్చ జరిగిందని తెలిపారు. ప్రజాప్రతినిధులు నిత్య విద్యార్థుల్లా పనిచేస్తూ తమ వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని హితవు పలికారు.

మున్సిపాలిటీకి వచ్చిన రూ.50 కోట్ల నిధులను ప్రాధాన్యత క్రమంలో వినియోగించి అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ సమస్యలు, అంతర్గత రోడ్ల మరమ్మతులు, వీధిదీపాల ఏర్పాటు వంటి పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.

పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగిస్తూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా పేదలు, మహిళలు, వృద్ధుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

భివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా, జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని, వాటి పురోగతిపై క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పింకేష్, ఆర్డీఓ వెంకన్న, మున్సిపల్ కమిషనర్ రాధాకృష్ణ, మున్సిపల్ చైర్మన్ వినయ్, వైస్ చైర్మన్, వార్డు కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్‌లో వరంగల్ కు స్వర్ణం

**ఏసీపీల జోడీని వరించిన విజయం**



సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా జరుగుతున్న 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో వరంగల్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ అధికారులు సత్తా చాటారు. 55 ఏళ్ల గెజిటెడ్ అధికారుల బ్యాడ్మింటన్ విభాగంలో వరంగల్ కమిషనరేట్‌కు చెందిన ఏసీపీలు జితేందర్ రెడ్డి, మధుసూదన్ జోడీ అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. కోర్టులో పదునైన ఆటతీరుతో ప్రత్యర్థులను చిత్తు చేసి ప్రథమ స్థానంలో నిలిచారు.

### టేబుల్ టెన్నిస్‌లో స్వర్ణం..



రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో వరంగల్ కమిషనరేట్ పతకాల వేట కొనసాగిస్తోంది. సైబరాబాద్‌లో నిర్వహిస్తున్న 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా శుక్రవారం జరిగిన టేబుల్ టెన్నిస్ ఓపెన్ కేటగిరీలో కానిస్టేబుల్ తులసీదాస్ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ప్రత్యర్థులను మట్టి కరిపించి స్వర్ణ పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా పతక విజేతను టీమ్ మేనేజర్‌తో పాటు సహచర క్రీడాకారులు అభినందించారు.

## 24నుంచి బాల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగరంలోని శ్రీ బాలానగర వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 24 నుంచి మార్చి 1వ తేదీ ఆదివారం వరకు శ్రీవారి ఉత్సవసేవా సమితి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు సేవా సమితి అధ్యక్షులు గందె గోవింద రాజులు, కార్యదర్శి గుముడవెల్లి సత్యనారాయణ రావు తెలిపారు. అదే విధంగా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం నిర్వహించు స్వామి వారి మూల మంత్ర హవనంలో సంకల్పం చేయించుకొని ఆర్థిక ఇబ్బందులు, శారీరక, మానసిక సమస్యల నుంచి దూరం కావాలని సూచించారు. 25వ తేదీ నుండి 27 వరకు వివిధ సేవలు 28వ తేదీ శనివారం శ్రీ మహాలక్ష్మీ హోమం, అమ్మవారికి సారె, రథోత్సవం నిర్వహించనున్నారు. మార్చి 1వ తేదీ ఆదివారం ఉదయం చక్రస్నానం, మహా పూర్ణాహుతి, సాయంత్రం స్వామి వారికి విశేషంగా జరిగే పుష్పయాగంలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. అదే విధంగా ప్రతి రోజు స్వామి వారి ఆశీస్సులు, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## సమస్యలను పరిష్కరించండి

- కలెక్టర్‌కు చాంబర్ ప్రతినిధుల వినతి



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ :** ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ లో ఎదురవుతున్న పలు ఇబ్బందులతో పాటు చాంబర్ కు సంబంధించిన పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద గారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ముసలమ్మ కుంట మామిడిపండ్ల మార్కెట్ లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు లక్ష్మీపురం సమీకృత పండ్ల మార్కెట్ నిర్మాణంలో జాప్యంపై కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అదే విధంగా వ్యవసాయ మార్కెట్ పరిసరాలలో ఆర్టీఓ నిర్వహిస్తున్న వాహనాల తనిఖీల గురించి విన్నవించారు. ఈ మేరకు స్పందించిన కలెక్టర్ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ను సందర్శించారు. వ్యవసాయ మార్కెట్ నకు విచ్చేసిన సందర్భమున ఛాంబర్ అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్ కు పూల బొకే అందించి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో పర్యటించి పరిస్థితిలను స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చాంబర్ కార్యవర్గ సభ్యులు, వివిధ సెక్షన్ల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

- పాల్గొన్న ఎమ్మెల్యే దొంతి, కలెక్టర్ సత్య శారద
- గ్రేయిన్ మార్కెట్ లో మిర్చి రైతులతో ముచ్చటించిన పిచ్చాపాటి



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేట నియోజకవర్గంలో శుక్రవారం సంత్ సేవలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంత్ సేవలాల్ మహారాజ్ బంజారా సమాజానికి మార్గదర్శకుడిగా నిలిచి సమాజంలో ఐక్యత, నీతి, సేవా భావాలను పెంపొందించిన మహానుభావుడని పేర్కొన్నారు. ఆయన బోధనలు నేటి తరానికి కూడా ఆదర్శప్రాయమని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ సేవలాల్ మహారాజ్ చూపిన మార్గంలో సమాజ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఉమారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, బంజారా సంఘాల ప్రతినిధులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సేవలాల్ మహారాజ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

### గ్రేయిన్ మార్కెట్ సందర్శన..

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం సందర్శించారు. మిర్చి సీజన్ దృష్ట్యా మార్కెట్ లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు. మర్చి రైతులతో మాట్లాడి వారి సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి కె.సురేఖ, ఉన్నత శ్రేణి కార్యదర్శి ఆర్.మల్లేషం, కార్యదర్శి గ్రేడ్–2 జి.అంజిత్ రావు, తహసీల్దార్ శ్రీకాంత్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి, కార్యదర్శి మడూరి వేద ప్రకాష్, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లె సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### దుగ్గొండిలో పర్యటన..

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుక్రవారం దుగ్గొండిలోని పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి, పీఎంశ్రీ పథకం కింద మంజూరైన నిధుల వినియోగం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యా వాతావరణాన్ని సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, నూతన వంటశాల, భోజనశాల, సైన్స్ ల్యాబ్, ఏటీఎల్ ల్యాబ్, గ్రంథాలయం, బాలురు–బాలికల మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు మరియు పాఠశాల ప్రాంగణంలోని పచ్చదనాన్ని స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. పీఎంశ్రీ పథకం లక్ష్యాలకు అనుగుణంగా పాఠశాలలో విద్యార్థులకు ఉత్తమ విద్యా వాతావరణం కల్పించాలన్నారు. సందర్శనలో గుర్తించిన లోపాలను ఒక వారం లోపు సరిచేసి, ఫోటోలతో కూడిన అనుసరణ నివేదికను సమర్పించాలని ప్రధానోపాధ్యాయునికి జిల్లా కలెక్టర్ గారు ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పరిశుభ్రత మరియు నాణ్యమైన విద్యను మరింత బలోపేతం చేయడం ద్వారా పీఎంశ్రీ పథకం లక్ష్యాలను సాధించేందుకు జిల్లా పరిపాలన కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్, ప్రధానోపాధ్యులు సంబంధిత అధికారులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com